ఈ- క్రాప్‌తో బహుళ ప్రయోజనాలు

- ప్రారంభమైన పంట నమోదు
- సెప్టెంబర్ 15 వరకూ గడువు
- అన్నింటికీ అదే ఆధారం



మరికొమ్మదిన్నెలో ఈ పంట నమోదు చేస్తున్న వ్యవసాయ అధికారులు

ఎన్‌పీకుంట: ఈ పంట నమోదు(ఈ-క్రాప్ బుకింగ్)తో రైతులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయి. ఈ ఖరీఫ్ సీజనల్‌లో మండల వ్యాప్తంగా 9,503 ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. ఇందులో 2943 హెక్టార్లలో వేరుశనగ, 781 హెక్టార్లలో కంది, 261 హెక్టార్లలో వరి పంటలు సాగైనట్లు అధికారుల అంచనా. పంటలు సాగు చేసినప్పటి నుంచి చేతికి వచ్చేంత వరకు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించి సాగు చేసిన పంటలు నష్టపోతే ఆ నష్టపరిహారం పొందాలన్నా ఈ పంట నమోదు అవసరం అవుతుంది. అనువైన వర్షాలు కురిసి పంట అధిక దిగుబడి వచ్చినా ప్రభుత్వ మద్దతు ధరతో అమ్ముకునేందుకు ఈ-క్రాప్ కీలకం. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లు రాయితీపై పొందేందుకూ ఇదే ఆధారం. ఈ పంట నమోదుతో రైతులకు కలిగే ఉపయోగాలను గ్రామాల్లో రైతు సేవా కేంద్రం సిబ్బంది వివరిస్తున్నారు. ఈ విషయంపై ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి లోకేశ్వర్‌రెడ్డి తెలిపారు.

పంటల నమోదు తప్పనిసరి

పంటలు సాగు చేసిన తరువాత ప్రతి రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలి. పంట నమోదు ప్రక్రియ కోసం గ్రామానికి వచ్చే గ్రామ రెవెన్యూ అధికారులు, రైతుసేవా కేంద్రం సిబ్బందికి సహకరించి తమ పంటలకు నమోదు చేయించుకోవలసిన బాధ్యత రైతులపై ఉంది. ఇందుకు పట్టాదారు పాసుపుస్తకంతో పాటు, పాసు పుస్తకంలోని సర్వేనంబర్లన్నీ ఆన్‌లైన్‌లో నమోదై ఉండాలి. ప్రతి రైతు తమ పొలం వద్ద పట్టాదారు పాసుపుస్తకం, 1బీ, ఆధార్ కార్డ్, బ్యాంకు ఖాతా పుస్తకం అందుబాటులో ఉంచుకొని నమోదు చేయించుకోవాలి. పొలాలలో పంట సాగు చేసిన వాటికి కాకుండా కొంత మంది రైతులు వేరే పంటలను నమోదు చేయించుకుంటే భవిష్యతులో కష్టాలు తప్పవని అధికారులు హెచ్చరిస్తున్నారు. సాగులో ఒక పంట వేసి ఈ పంట నమోదులో వేరే పంట చూపించడం వలన ఉత్పత్తులను విక్రయించే సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలుపుతున్నారు.

ఉపయోగాలు ఇలా...

- సాగు చేసిన పంటలను ఈ పంట నమోదు చేసుకోవడం వలన గ్రామ విస్తీర్ణం, మండల విస్తీర్ణం ఏ పంటలు సాగు చేశారో అధికారులకు తెలుస్తుంది.
- కరువు పరిస్థితులు ఏర్పడినపుడు ఏ పంటలు నష్టపోయారు, ఎంత విస్తీర్ణం, ఎంత మంది రైతులు అనే అంశాలు స్పష్టంగా ఉంటాయి.
- విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పనిముట్లపై రాయితీ, పంటల బీమా, అన్నదాత సుఖీభవ తదితర పథకాల నుంచి లబ్ధి పొందవచ్చు.
- మద్దతు ధరతో పంట దిగుబడులను విక్రయించే సమయంలో ఎటువంటి సమస్య లేకుండా పంటసాగు ధ్రువీకరణ పత్రం పొందడానికి వీలు ఉంటుంది.

15 లోపు నమోదు చేయించుకోవాలి



సెప్టెంబరు 15వ తేదీ లోపు పంటలు సాగు చేసిన రైతులు తప్పకుండా తమ పంటలను ఈ పంట నమోదు చేయించుకోవాలి. ఇప్పటి వరకు మండలంలో 9503 ఎకరాలకు గాను 2,600 ఎకరాల్లో ఈ పంట నమోదు ప్రక్రియ పూర్తయింది. ఇచ్చిన గడువు లోపు పంట నమోదు ప్రక్రియ పూర్తి చేస్తాం.

లోకేశ్వరరెడ్డి,
ఏఓ, ఎన్.పీ.కుంట మండలం

క్లుప్తంగా

ఎస్పీని కలసిన డీఎస్పీ మహేష్



ఎస్పీ రత్నకు పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ మహేష్

పుట్టపర్తి టౌన్: హిందూపురం డీఎస్పీ కేవీ మహేష్ ఎస్పీ రత్నను ఆమె క్యాంపు కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈసందర్భంగా ఎస్పీ శాంతిభద్రతలపై దృష్టి సారించాలని డీఎస్పీకి సూచించారు. హిందూపురం రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో మద్యం, ఇసుక అక్రమ రవాణా జరిగే అవకాశం ఉందని, వాటికి అడ్డుకట్టవేయాలని ఆదేశించారు.

కదిరి రూరల్ సీఐగా నాగేంద్ర



కదిరి టౌన్: స్థానిక రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా నాగేంద్ర గురువారం బాధ్యతలు చేపట్టారు. ఆయన అన్నమయ్య జిల్లా రాయచోటి దిశా మహిళ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికొచ్చారు. ఈసందర్భంగా సీఐకు ఎస్ఐలు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. ప్రజలకు అందుబాటులో వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సీఐ పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తా



బాధ్యతలు తీసుకుంటున్న సీఐ ఇందిర

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు సర్కిల్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేస్తానని సీఐ ఇందిర పేర్కొన్నారు. గురువారం ఆమె కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ రాజారమేష్‌కు వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో అనంతపురం స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్న ఇందిర ఇక్కడికి వచ్చారు. ఈసందర్భంగా ఆమెకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

గడువులోపు ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలి

బత్తలపల్లి: గడువు ముగిసేలోపు మండలంలోని రైతులందరూ ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ ఓబిరెడ్డి పేర్కొన్నారు. గురువారం డి.చెర్లోపల్లిలో జరుగుతున్న ఈ-క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న రైతులందరూ ఏఏ పంటలు వేశారో దానికి సంబంధించిన వివరాలను పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదు చేయించుకుంటేనే పంటల బీమా, పంట నష్టపరిహారం వంటివి వర్తిస్తాయన్నారు.

ముగిసిన రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



రాఘవేంద్రస్వామికి పూజలు చేస్తున్న అర్చకులు

ధర్మవరం అర్బన్: స్థానిక ఎస్‌బీఐ కాలనీలోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న 353వ ఆరాధన ఉత్సవాలు గురువారం ఉత్తరారాధనతో ముగిశాయి. ఈసందర్భంగా అర్చకులు రాఘవేంద్రస్వామిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. గాంధీనగర్‌లోని శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: తుంపర్తి కాలనీకి చెందిన వెంకటరంగారెడ్డి గురువారం పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు యత్నించాడు. పట్టణంలో ఒక స్థలం విషయమై మోసపోయానంటూ తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. ఇంటి వద్ద పురుగుల మందు సేవించి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఘనంగా ప్రెషర్స్‌డే

ధర్మవరం రూరల్: ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ కె.లక్ష్మీకాంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. కొత్తచెరువు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతిర్లత, ధర్మవరం ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ బండి వేణుగోపాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీనియర్స్, జూనియర్స్ కలిసి మెలిసి చదువుకోవాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఉపాధి హామీ పనులు ఎంపిక చేయండి

గాండ్లపెంట: మండల వ్యాప్తంగా ఉన్న 14 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి ఉపాధి హామీ పనులను ఎంపిక చేయాలని ఎంపీడీఓ రామానాయక్ ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు. గురువారం గ్రామసభలపై సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో గ్రామసభలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉపాధి కూలీలకు ఉపాధి పనుల కల్పనతో పాటు గ్రామాల్లో తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, సీసీరోడ్లు తదితర అంశాలపై గ్రామసభలో అవగాహన కల్పించాలన్నారు. ఈఓఆర్డీ సునీత, పంచాయతీ కార్యాదర్శులు, గ్రామ సచివాలయాలు, ఉపాధి హామీ సిబ్బంది, ఏపీఓ, వెలుగు ఏపీఎం తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: మండలంలో శుక్రవారం నుంచి ఉపాధి హామీ పనుల గుర్తింపు కోసం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి, ఏపీఓ సంజీవరెడ్డి గురువారం తెలిపారు. సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి కూలీలు, సిబ్బంది హాజరుకావాలని వారు కోరారు.

బత్తలపల్లి: మండలంలోని 13 పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీ పనుల ఎంపికపై గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సాయిమనోహర్, ఏపీఓ ఆదెప్ప తెలిపారు. కార్యదర్శులు, సచివాలయ, ఉపాధిహామీ పథకం సిబ్బంది, గ్రామస్థాయిలోని అన్ని శాఖల అధికారులు, గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని కోరారు.

కదిరి అర్బన్: మండలంలోని 14 పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అంజనప్ప గురువారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, స్వయం సహాయక సంఘాల లీడర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామసభల్లో ఉపాధి హామీ పనులను ఎంపిక చేయాలన్నారు.

ఉపాధి పనుల గుర్తింపునకు గ్రామసభలు

చెన్నేకొత్తపల్లి: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పనుల గుర్తింపునకు శుక్రవారం గ్రామసభలు జరుగుతాయని ఎంపీడీఓ గంగావతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో పనులు గుర్తించడం జరుగుతుందన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఉపాధి కూలీలు, మేట్లు, శ్రమశక్తి సంఘాల సభ్యులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొనాలని సూచించారు. ఈ గ్రామసభలకు మండల స్థాయి అధికారులను పర్యవేక్షణ అధికారులుగా నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

దోషులను బహిరంగంగా ఉరి తీయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్నర్‌వీల్‌క్లబ్, రోటరీక్లబ్ సభ్యులు

ధర్మవరం అర్బన్: కోలకతాలో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం, హత్య చేసిన దోషులను బహిరంగంగా ఉరి తీయాలని ఇన్నర్‌వీల్‌క్లబ్ అధ్యక్షురాలు నాగరత్నమ్మ, సభ్యులు పర్విన్, రాజేశ్వరి, భాగ్యలక్ష్మి, సుమలత డిమాండ్ చేశారు. పట్టణంలో గురువారం ఇన్నర్‌వీల్‌క్లబ్, రోటరీ క్లబ్, మానవ హక్కుల సంరక్షణ సమితి సంయుక్తంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యురాలిపై అఘాయిత్యానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించడంతోపాటు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చట్టాలు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ సభ్యులు జయసింహా, నాగభూషణ, రమేష్, శివయ్య, బీవీ చలం తదితరులు పాల్గొన్నారు.

పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల ర్యాలీ

కోలకతాలో ట్రైనీ డాక్టర్‌ను అత్యాచారం, హత్య చేసిన నిందితులను ఉరితీయాలని పద్మావతి మహిళా డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బుట్రా సాయి, డైరెక్టర్ బుట్రా జగదీష్, ప్రిన్సిపల్ మల్లికార్జున డిమాండ్ చేశారు. పట్టణ పురవీధుల్లో విద్యార్థినులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదాం



ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి

ధర్మవరం అర్బన్: ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొడదామని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి విద్యార్థులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం అంతర్జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రజల్లో ఎయిడ్స్‌పై ఉన్న అపోహలను తొలగించాలని సూచించారు. ఎయిడ్స్ నివారణలో విద్యార్థులు భాగస్వాములు అయి భారత దేశం నుంచి వ్యాధిని పారదోలడానికి కృషి చేయాలని తెలిపారు. నెహ్రూ యువ కేంద్రం సంస్థ డైరెక్టర్ భరత్, ఇన్‌చార్జ్ శ్రీనివాసులు, ఐసీటీసీ కౌన్సిలర్ అరవింద్, మైత్రి సంఘం ప్రాజెక్టు డైరెక్టర్ రాధమ్మ, ఎస్ఎంఎంఎస్ బోర్డు సభ్యులు నారాయణమ్మ, ప్రాజెక్టు మేనేజర్ నవీన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ గోపాల్‌నాయక్, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ చిట్టమ్మ, అధ్యాపకులు షమీ ఉల్లా, గోపాల్‌నాయక్, భువనేశ్వరి, పుష్పావతి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి టౌన్: కొత్తచెరువు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జన జాగృతి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ అంజనేయులు ఎయిడ్స్ ఎలా వస్తుంది, ఎలా వ్యాపించదు, అది రాకుండా ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజేశారు. ఎయిడ్స్ బాధితులను చిన్న చూపు చూడకూడదన్నారు. అలాగే 2017 ఎయిడ్స్ యాక్ట్, ఏఆర్‌టీ మందులు ఏపీఎస్ఎసీ యాప్, 1097 టోల్‌ఫ్రీ నంబర్‌పై వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాణిబాయ్, ఏఎన్ఎం హరిత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు నివారణకు టీకాలు వేయించుకోండి

బత్తలపల్లి: పశువులలో గాలికుంటు వ్యాధి వ్యాపించకుండా ముందస్తుగా టీకాలు వేయించుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, పశువైద్యాధికారి గుర్నాథరెడ్డి పేర్కొన్నారు. గురువారం వారు స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో విలేకర్లతో మాట్లాడారు. జాతీయ పశువ్యాధి నివారణ పథకంలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో పశువులకు ముందు జాగ్రత్తగా గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్నామన్నారు. రైతులు అపోహలను విడినాడి తమ పశువులన్నిటికీ టీకాలు ఉచితంగా వేయించుకోవాలని సూచించారు.

పంటలను ఎఫ్‌పీఓలకు విక్రయించండి

ధర్మవరం రూరల్: రైతులు తమ పంటలు ఎఫ్‌పీఓలకు మాత్రమే అమ్మాలని ఏఫ్ ఎకాలజీ సంస్థ ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ శంకర్ నాయక్ సూచించారు. గురువారం పోతుకుంట ఆర్డీటీ పాఠశాలలో రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకారం సంఘం 8వ వార్షిక మహాసభను పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో ఏఎఫ్ ఎకాలజీ సహకారంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీఓ కోఆర్డినేటర్ మాట్లాడుతు ధర్మవరం రైతు ఉత్పత్తి దారుల సంఘంలో ధర్మవరం పరిధిలోని 22 గ్రామాల నుంచి 400 మంది సభ్యులుగా ఉన్నారన్నారు. ఎఫ్‌పీఓ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రైతు అంగడి నుంచి రైతులకు వ్యవసాయ పనిముట్లు, పశువుల దాణా, విత్తనాలు మార్కెట్ ధరల కంటే తక్కువ ధరలకే అందిస్తామన్నారు. ధర్మవరం మండలం టీం లీడర్ దస్తగిరి, ఎఫ్‌పీఓ మేనేజర్ ప్రతాప్‌కుమార్, సీఈఓలు నరసింహులు, మోహన్, ఎస్‌టీఓలు విక్రమ్, ఎర్రిస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి



అన్వర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పూల శ్రీనివాసరెడ్డి

నల్లచెరువు: కదిరి నిజాంవలి కాలనీలో నివాసముండే నల్లచెరువు మండలం గౌర్లవాండ్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త అన్వర్(30) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుకున్న వైఎస్సార్ సీపీ రాష్ట్ర సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి అన్వర్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. నాయకులు బసిరెడ్డి విశ్వనాథ్‌రెడ్డి, షమీవుల్లా పాల్గొన్నారు.

నిరవధిక సమ్మెలో 'సత్యసాయి' కార్మికులు



తాడిమర్రిలో సమ్మె చేస్తున్న సత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు

తాడిమర్రి: శ్రీసత్యసాయి తాగునీటి సరఫరా కార్మికులు గురువారం నిరవధిక సమ్మెకు దిగారు. పెద్దకోట్ల గ్రామంలో ఉన్న ప్రదాన తాగునీటి సంపు నుంచి తాగునీటి సరఫరా బంద్ చేశారు.అలాగే తాడిమర్రి సమీపంలోని మద్దలచెరువు తాగునీటి సరఫరా సంపులో పనిచేస్తున్న కార్మికులు గత 6 నెలలుగా వేతనాలు అందక పోవడంతో నిరవధిక సమ్మెకు దిగినట్లు సంఘం నేత ఎమ్.సతీష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో 536 మంది కార్మికులు పని చేస్తున్నారన్నారు. వారికి 6నెలలుగా వేతనాలు అందలేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండుచేశారు. నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న బోనస్ ఇవ్వాలన్నారు. వీడీఏ పద్ధతిలో జీఓ 11 ప్రకారం వేతనాలు ఇవ్వాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సకాలంలో చెల్లిచాలని ప్రభుత్వాన్ని కోరారు. నాయకులు కె.పెద్ద ఓబులేసు, వి.తిరుపాలు, బి.నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కదిరి అర్బన్: తమకు పెండిగ్‌లో ఉన్న 6 నెలల జీతాలు ఇవ్వాలని గురువారం కాళసముద్రం గ్రామంలో సత్యసాయి మంచినీటి కార్మికులు ట్యాంక్ వద్ద ధర్నా చేశారు. వారు మాట్లాడుతూ తమకు గత ఆరునెలల నుంచి జీతాలు ఇవ్వకపోతే తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు జీతాలు మంజూరు చేయాలన్నారు. కార్మికులు శివ, ఆంజనేయ శర్మ, ఎల్ నాయక్, డీ నాయక్, ఆశోక్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం అర్బన్: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం సమీపంలోనున్న పంప్‌హౌస్ వద్ద గురువారం సత్యసాయి తాగునీటి కార్మికులు నిరసన తెలిపారు. ఆరు నెలలుగా జీతాలు అందలేదని 11 నెలల పీఎఫ్ అందించలేదన్నారు. ఈఎస్ఐ సౌకర్యం కల్పించలేదని, చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

ముదిగుబ్బ: పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే చెల్లించాలని గురువారం సత్యసాయి పంపు హౌస్ వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు.

కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట



ఆలయంలో ప్రతిష్ఠంచనున్న కొల్లాపురమ్మ విగ్రహం

కనగానపల్లి: మండలంలోని భానుకోట గ్రామంలో కొల్లాపురమ్మ శక్తి దేవాలయంలో నూతన విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం బుధవారం రాత్రి నుంచి వేదపండితుల ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు చేపట్టారు. గురువారం పూర్ణ కలశాలు, నవగ్రహ పూజలు, హోమాలు చేశారు. శుక్రవారం తెల్లవారుజామున 5:30 నుంచి 6:30 మధ్య అమ్మవారి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని పూజారి రమేష్ శర్మ తెలిపారు. కొల్లాపురమ్మ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా స్థానిక గ్రామ స్తుల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

వైభవంగా సంకష్టహర చతుర్థి

కదిరి టౌన్: పట్టణంలోని ఉమామహేశ్వరి (శివాలయం)లో గురువారం రాత్రి సంకష్టహర చతుర్థి వేడుకలు వైభవంగా నిర్వహించారు. అర్చకులు వినాయకుడి విగ్రహానికి పంచామృత అభిషేకం, గరిక పూజ, సంకటహర చతుర్థి వ్రత తదితర పూజలు చేపట్టారు. ప్రతి నెలా పౌర్ణమి తర్వాత వచ్చే చవితిని సంకటహర చతుర్థిగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన తర్వాత మహిళలు చంద్రుడిని చూసి ఉపవాసాలు వీడారు.



ప్రత్యేక అలంకరణలో గణపతి

నిందితుడికి రిమాండ్

కదిరి టౌన్: పట్టణంలో అధిక వడ్డీతోపాటు అధిక కమీషన్లు తీసుకుంటున్న సుల్తాన్ అనే వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ డీవీ నారాయణరెడ్డి తెలిపారు. గాజుల వీధికి చెందిన షేక్ ఉమ్మర్ ఫరూక్,షేక్ బాబా ఫక్రోద్దీన్ ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్‌కు ఆదేశించారని సీఐ తెలిపారు.

మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని ఏపీఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండి శివ డిమాండ్ చేశారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలకు మారుమూల గ్రామాల నుంచి విద్యార్థులు వస్తున్నారన్నారు. చాలా మంది విద్యార్థులు మధ్యాహ్నం పూట పస్తులుంటున్నారన్నారు. కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేసి విద్యార్థుల ఆకలిని తీర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు స్వామి, దినేష్, సాయిచరణ్, శంకర్, కార్తీక్, కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేతిరెడ్డి కాలనీలో కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తున్న ఒకరిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. కేతిరెడ్డికాలనీకి చెందిన ఉప్పర చంద్ర కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి అతడిని అరెస్టు చేశామన్నారు. నిందితుడిని నుంచి 43 హైవర్డ్స్ విస్కీ 90 ఎంఎల్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ద్విచక్ర వాహనం వేలం

పుట్టపర్తి టౌన్: ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ఓ ద్విచక్ర వాహనాన్ని ఈ నెల 24న వేలం వేయనున్నట్లు సెబ్ ఎస్ఐ రమణారెడ్డి తెలిపారు. ఆసక్తి ఉన్న వారు రూ.వెయ్యి ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పుట్టపర్తిలోని సెబ్ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

దైవ సేవకుల సదస్సు



ముఖ్య అతిథిని సన్మానిస్తున్న పాస్టర్స్ కమిటీ సభ్యులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని మార్కెట్‌వీధిలో నున్న ఎస్ఐయు చర్చిలో గురువారం దైవ సేవకుల సదస్సు నిర్వహించారు. వేలూరుకు చెందిన దైవ సేవకులు డాక్టర్ దేవ సహాయం మాట్లాడుతూ పేదలను ప్రేమతో ఆదరించాలన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను సన్మానించారు. పాస్టర్స్ కమిటీ అధ్యక్షుడు షేక్ మోజెస్, ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, సహ కార్యదర్శి సోలోమోన్, కోశాధికారి గ్రేసయ్య, సీనియర్ దైవ సేవకులు సుందర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

పుట్టపర్తి టౌన్: చెరువులో బోట్లు దింపుతుండగా క్రేన్ పక్కకు ఒరిగి చెరువులో పడిపోయిన ఘటనలో ప్రమాదం తప్పింది. వివరాలు..గురువారం బుక్కపట్నం చెరువులోకి బోటింగ్ నిర్వాహకుడు జ్యోతి కేశవ బోట్లు దింపుతుండగా క్రేన్ పక్కకు ఒరిగి చెరువులోకి పడిపోయింది. అప్రమత్తమైన క్రేన్ డ్రైవర్ చెరువులోకి దూకి సురక్షితంగా బయటపడ్డాడు.

ఉచిత గర్భకోశ చికిత్సా శిబిరం

నల్లమాడ: రెడ్డిపల్లిలో జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఉచిత పశు గర్భకోశ చికిత్సా శిబిరం నిర్వహించారు. లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయటం ద్వారా 90 శాతం కచ్చితత్వంతో పెయ్య దూడల జన్మిస్తాయని డీఎల్‌డీఏ అనంతపురం జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ టీవీ సుధాకర్ తెలిపారు. రెడ్డిపల్లి పశువైద్యాధికారి డాక్టర్ బీ. రవీ నాయక్, ఏహెచ్ఏలు పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



విద్యార్థినిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ స్మిత

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇటీవల జరిగిన హ్యాండ్‌బాల్ అంతర్ జిల్లా పోటీల్లో కళాశాల బీకాం సెకండియర్ విద్యార్థిని ఝాన్సీ ప్రథమ స్థానంలో నిలిచింది. గురువారం విద్యార్థిని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మిత అభినందించారు. అధ్యాపకులు హైదరాలి, పీడీ నరసింహాచారి పేర్కొన్నారు.

పోలీసులో అదుపులో బైక్ దొంగ

కనగానపల్లి: మండలంలోని సోమరవాండ్లపల్లిలో ద్విచక్ర వాహనాన్ని (బైక్) తీసుకెళ్తున్న ఓ దొంగను కనగానపల్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. స్థానిక గ్రామస్తులు తెలిపిన వివరాలు.. బుధవారం రాత్రి గ్రామంలోని కుమ్మరి నాగేంద్ర అనే వ్యక్తి ఇంటి వద్ద నిలిపిన బైక్‌ను తీసుకెళ్లేందుకు దొంగలు ప్రయత్నించారు. ఇంతలో చుట్టు పక్కల వారు గమనించి దొంగలను వెంబడించారు. వారిలో ఓ దొంగను పట్టుకున్నారు. తర్వాత పోలీసులకు సమాచారం అందించి దొంగను పోలీసులకు అప్పగించినట్లు సమాచారం. కాగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో బాధితుడు నాగేంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైక్ దొంగల కోసం గాలిస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ధర్మవరం డివిజన్
9912220717, 9912220727,
9912220726, 9010593486